క్లుప్తంగా

విరిగిన సిగ్నల్ సూచిక బోర్డు



సోమవరప్పాడు వద్ద విరిగిపోయిన సిగ్నల్ సూచిక బోర్డు

దెందులూరు: సోమవరప్పాడు వద్ద డబుల్ రోడ్డు విడిపోయే ప్రదేశం వద్ద సిగ్నల్ పూర్తిగా విరిగిపోయింది. ఈ రహదారిపై ఏలూరు- జంగారెడ్డిగూడెం, జంగారెడ్డిగూడెం- ఏలూరు వందలాది బస్సులు, లారీలు, ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు ప్రతిరోజూ తిరుగుతుంటాయి. డబుల్ రోడ్డు వద్ద సిగ్నల్ లేకపోవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత శాఖాధికారులు వెంటనే స్పందించి సిగ్నల్ ఏర్పాటు చేయాలని ప్రజలు, ప్రయాణీకులు కోరుతున్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్



ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న విద్యార్థులు

ఉంగుటూరు: సైన్స్ ఎగ్జిబిషన్ విద్యార్థులు ఎంతో ఆశక్తిగా తిలకించారని, ఇది వారికి ఎంత గానో ఉపయోగపడుతుందని భౌతిక శాస్త్ర అధ్యాపకుడు వెంకటేశ్వరరెడ్డి అన్నారు. ఎస్ఏఎస్ ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ చదువుతున్న ప్రథమ, తృతీయ సంవత్సరం విద్యార్థులు మంగళవారం విజయవాడ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాలలో నిర్వహించిన ఫోర్త్ స్టేట్ ఆఫ్ ప్లాస్మా ఎగ్జిబిషన్‌ను తిలకించి వచ్చారు. ఆ ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న విద్యార్థులు వివిధ పరికరాలు, విధి విధానాలను తెలుసుకున్న విద్యార్థులు చాలా ఆనందంగా ఉందని, అనేక కొత్త విషయాలను తెలుసుకోగలిగామని వివరించారు. ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరరావు మా ట్లాడుతూ ఇలాంటి ఎగ్జిబిషన్ వీక్షించడంవల్ల సైన్స్ పట్ల అవగాహన పెరుగుతుందన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి



కొఠారు రామచంద్రరావును కలిసిన గాలాయగూడెం సర్పంచ్ వెంకట సుబ్బారావు

దెందులూరు: అన్ని గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు సమష్టిగా పార్టీ బలోపేతానికి, సమస్యల పరిష్కారానికి తమ వంతు సహాయ సహకారాలు అందించాలని ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత కొఠారు రామచంద్రరావు అన్నారు. మంగళవారం కొండలరావుపాలెం మాజీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గాలాయగూడెం సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అంబటి లక్ష్మణరావు, వార్డు మెంబర్లు శ్రీధర్, రాజీవ్, నాయకులు బోయపాటి గణేష్, బసవయ్య, ముసునూరు వెంకటేశ్వరరావు, మాజీ సొసైటీ చైర్మన్ తోట అచ్చియ్య, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఉధృతంగా గుండేరు వాగు



జోగన్నపాలెంలో ఉధృతంగా ప్రవహిస్తున్న గుండేరు వాగు

దెందులూరు: గుండేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. జోగన్నపాలెం వంతెన వద్ద వాగు ప్రవాహం వేగంగా వస్తున్నప్పటికీ నిలకడగా ఉంది. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సైఫన్ వద్ద ఇసుక బస్తాల ఏర్పాటు

గుండేరువాగు ఉధృతికి ఎటువంటి ప్రమాదం జరగకుండా నీరు వృథా పోకుండా ముందస్తుగా రక్షణ చర్యలు ఏర్పాటు చేశారు. మంగళవారం దెందులూరు సైఫన్ వద్ద ఎగువ నుంచి వచ్చే గుండేరు వాగు నీరు వృథాగా పోకుండా, దెందులూరు- అలుగులగూడెం గ్రామాల రాకపోకలకు అసౌకర్యం కలగకుండా ఇసుక బస్తాలను రక్షణగా ఏర్పాటు చేశారు. మూడు రోజులు క్రితం వాగు ఉధృతికి రక్షణగా ఏర్పాటు చేసి ఇసుక బస్తాలు కొట్టుకుపోయాయి.

10న అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

దెందులూరు: దెందులూరు ఇంద్రవనం వీధిలోని ఆలయంలో ఈ నెల 10న అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించనున్నట్టు దెందులూరు మండల రామదండు నాయకులు సుగ్గిశెట్టి నూకరాజు తెలిపారు. 9వ తేదీన ఆలయంలో ఉదయం హోమం, సాయంత్రం ఆవుపాల అభిషేకం, వరి ధాన్యంతో అభిషేకం, 10న విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్టు తెలిపారు.

ఈ-క్రాప్.. జాడేదీ?

- పంట నమోదు కోసం ఎదురు చూస్తున్న రైతులు, కౌలుదారులు
- 52,510 ఎకరాల్లో నమోదుకాని ఈ-క్రాప్



దుద్దేపూడిలో వరి పంటకు ఈ- క్రాప్ నమోదు చేస్తున్న వీఏఏ (ఫైల్)

భీమడోలు: ఈ క్రాప్ నమోదుపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి. అన్నదాతకు భరోసాగా ఉండే ఈ క్రాప్ పథకం అమలుపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్న విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే వర్షాలతో నాట్లు దెబ్బతిన్న అన్నదాతలకు పంట పరిహారం అందాలంటే ఈ క్రాప్ నమోదు చేయాల్సిండగా నేటికీ ఈ ప్రక్రియ ఆరంభించలేదు. నియోజకవర్గంలో గ్రామాల్లో వరి నాట్లు పూర్తి కావస్తున్నా నేటికీ ఈ- క్రాప్ ప్రారంభించకపోవడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ విధి విధానాలపై స్పష్టమైన వైఖరిని కూటమి ప్రభుత్వం ఇంకా ప్రకటించలేదు. ఇప్పటికే కొత్త ప్రభుత్వం ప్రకటించిన అన్నదాత సుఖీభవ పథకం కింద పంట సాయం అందక రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ తీరుపై రైతులు తీవ్ర ఆగ్రహాన్ని ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

పథకాల అమలుపై దాగుడు మూతలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన రైతు భరోసా పథకం, ఈ- క్రాప్ పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ వంటి పథకాలు అమలు అవుతాయో లేదోనని రైతులు ఆందోళం చెందుతున్నారు. ఆయా పథకాలపై కూటమి ప్రభుత్వం దాగుడు మూతలు ఆడడం అందరూ గమనిస్తూనే ఉన్నారు. గత ఖరీఫ్ హెక్టార్లలో సాగు చేయగా నూరు శాతం ఈ క్రాఫ్ నమోదు చేశారు. రబీలో పంటల సాగు నామమాత్రంగా జరిగినా ఈ క్రాఫ్ పూర్తి చేశారు. ఈ ఏడాది ఖరీఫ్ సాగులో లక్ష్యంగా కాగా ఇప్పటి వరి పంటను సాగు చేశారు. నియోజకవర్గంలోని భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం మండలాల్లో 52,510 ఎకరాల్లో వరి, చెరకు, ఉద్యానవనం, కూరగాయాలు, పండ్ల మొక్కలను సాగు చేస్తున్నారు. దీనితో వేలాది మంది రైతులు విత్తనం నాటి నుంచి విక్రయం వరకు అండగా ఉండే ఈ క్రాప్ విధానాన్ని అమలు చేయకపోతే భవిష్యత్తులో తీవ్రంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన తరుణంలో అండగా ఉండేందుకు అర్హులైన రైతులకు అన్ని విధాలుగా మేలు చేసేందుకు ఈ-క్రాప్ విధానం చక్కగా తోడ్పాటు అందించింది.

ఈ-క్రాప్ అమలు చేయకుంటే అన్నదాతకు కష్టం

వ్యవసాయం చేపట్టే రైతులు, కౌలు రైతుల వివరాలు, సర్వే నంబర్లు, వ్యవసాయశాఖ వద్ద సమగ్రంగా ఉండే అవకాశం లేదు. సాగు వివరాలు తెలియకపోవడంతో సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు తగిన సమాచారం చెప్పే ఆస్కారం లేకుండా పోతుంది. రాయితీలపై విత్తనాలు, ఉచిత పంటల బీమా, సున్నా రాయితీలు పొందే హక్కు, వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ గిట్టుబాటును కోల్పేయే అవకాశం ఉంది. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు దెబ్బతింటే పెట్టుబడి రాయితీ పొందే అవకాశాన్ని రైతులు కోల్పోతారు.

త్వరలో పంట నమోదు ప్రారంభిస్తాం



యాప్‌ను సమర్థవంతంగా అమలు చేసే క్రమంలో ఈ-క్రాప్ జాప్యం జరిగింది. రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు యాప్‌ను అప్‌డేట్ చేసి అధికారులకు అందజేశారు. ఈ- పంట నమోదుకు సంబంధించి మార్గదర్శకాలు అందాయి. వాటిని మండలస్థాయి అధికారులు పరిశీలించి గ్రామాల వారీగా సర్వే నంబర్లను గుర్తించి సచివాలయాల్లో వీఏఏలకు అందజేస్తారు. వారంతా తమ పరిధిలోని పంట సాగు నమోదులో భాగంగా రైతు, పంట విస్తీర్ణం, సర్వే నంబర్ తదితర అంశాలను నమోదు చేస్తారు.

– డాక్టర్ పి.ఉషారాజకుమారి, ఏడీఏ, భీమడోలు

వైఎస్సార్‌సీపీ హయాంలో సక్రమంగా పథకం అమలు

ప్రభుత్వం మంజూరు చేసే ప్రతి రూపాయి గ్రామస్థాయిలో రైతులకు అందజేయాలన్న ఆశయంతో 2019 రబీ సీజన్ ప్రతిష్టాత్మకమైన ఈ- క్రాప్ విధానాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలుల్లోకి తీసుకుని వచ్చింది. రైతు భరోసా కేంద్రం, యూనిఫైడ్ డిజిటల్ ఫ్లాట్‌ఫాం యాప్ ద్వారా వ్యవసాయ, ఉద్యానవన, పట్టు, పశు గ్రాస పంటలతో పాటు సామాజిక వనాలను ఆర్‌బీకేల్లో నమోదు చేయడం ద్వారా పారదర్శకంగా ఉండేది. రెవెన్యూ వెబ్‌ల్యాండ్ డేటాను అనుసరించి క్షేత్రస్థాయిలో పరిశీలించిన అంశాల వారీగా ఆర్‌బీకే వ్యవసాయ సహాయకులు ఈ క్రాప్ విధానంలో పంట నమోదు చేసేవారు. ఈ క్రాప్ విధానంలో అమలులో ఉండడం వల్ల రైతు సాగు చేసే పంటల వివరాలు వ్యవసాయ శాఖలో నమోదు అయ్యేవి. ఈ క్రాప్ నమోదు చేసుకున్న వెంటనే సంబంధిత రైతు వివరాలన్నీ ఆర్‌బీకేల్లో ఏర్పాటు చేసి కియోస్క్ మిషన్‌లో నిక్షిప్తమయ్యాయి. సమయానికి ఎరువులు, పురుగు మందులు, నాణ్యతమైన విత్తనాలు, రాయితీపై లభించే అవకాశం ఉంది. రైతులకు ప్రభుత్వమే బీమా చెల్లించి ఉచితంగా పంటల బీమా చేయించడం ద్వారా రైతులు సాగు పట్ల దీమాతో ఉండేవారు. ఈ క్రాప్ విధానంలో నమోదైన భూమిని బట్టి ఇన్‌పుట్ సబ్సిడీని త్వరితగతిన మంజూరు చేసేందుకు వీలు ఉండేది. రైతులు తమ పంట ఉత్పత్తులను ఎప్పుడైనా తమకు నచ్చిన రీతిలో గిట్టుబాటు ధరకు విక్రయంచే అవకాశం ఉండేది.

అభివృద్ధికి సమన్వయంతో కృషి చేస్తాం



భీమడోలు తహసీల్దార్ రమాదేవికి మొక్కను అందిస్తున్న వీఆర్వోలు, సిబ్బంది

భీమడోలు: భీమడోలు తహసీల్దార్‌గా బి.రమాదేవి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల అభివృద్ధికి రెవెన్యూ సిబ్బంది అంతా సమన్వయంతో కృషి చేస్తామన్నారు. భీమడోలు తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్ షంషూద్దీన్ నుంచి ఆమె చార్జి తీసుకున్నారు. ఇక్కడ పని చేసిన జి.వరహాలయ్య బదిలీల్లో భాగంగా తూర్పుగోదావరి జిల్లాకు వెళ్లారు. తూర్పుగోదావరి జిల్లా కడియం తహసీల్దార్‌గా పని చేస్తున్న రమాదేవిని ఎన్నికల తర్వాత బదిలీల్లో భాగంగా భీమడోలు తహసీల్దార్‌గా నియమించారు. విధుల్లో చేరిన తహసీల్దార్‌ను వీఆర్వోలు, సర్వే విభాగం, పౌరసరఫరాల విభాగం సిబ్బంది, అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. సీఎస్‌డీటీ ఏ.మాధవరావు, వీఆర్వోలు వినయ్, కందులపాటి శంకర్, ఇంతియాఫ్, సింహాచలం పాల్గొన్నారు.

నేడు పోస్టల్ శాఖ సేవలపై అవగాహన సదస్సు

దెందులూరు: పోస్టల్ శాఖలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పొదుపు, బీమాపై డాక్ చౌపల్ అవగాహన సమావేశం నిర్వహించనున్నట్టు దెందులూరు పోస్టుమాస్టరు తెలిపారు. స్థానిక పాత పీహెచ్‌సీ వెనుక ఉన్న పోస్టాఫీసులో సాయంత్రం 4 గంటలకు ఈ సమావేశం నిర్వహిస్తామని, జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ ఎస్.శ్రీకర్ బాబు విచ్చేస్తారని తెలిపారు.

తహసీల్దార్లు బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన తహసీల్దారు సతీష్‌కు అభినందనలు తెలుపుతున్న ఉద్యోగులు

ఉంగుటూరు: ఉంగుటూరు తహసీల్దారుగా పొట్టూరి సతీష్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. తహసీల్దారు స్థానిక కార్యలయం సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్ఏలు డిప్యూటీ తహసీల్దారు బొడ్డేపల్లి ప్రసాదు ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందచేసి అభినందనలు తెలిపారు. ఉంగుటూరు సర్పంచి బండారు సింధు, ఉపసర్పంచి పాతూరి జగదీష్, వార్డు సభ్యుడు తహసీల్దారును కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం తహసీల్దారు స్థానిక ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజును క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

దెందులూరు తహసీల్దార్‌గా సుమతి

దెందులూరు: దెందులూరు తహసీల్దార్‌గా బి.సుమతి మంగళవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. 2009లో ఏపీపీఎస్సీ గ్రూప్-2లో ద్వారా ఆమె డిప్యూటీ తహసీల్దార్‌గా, రెవెన్యూ శాఖలో ప్రవేశించారు. వరంగల్, ఖమ్మంలో పని చేశారు. రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లాలోని కుక్కునూరు, ఆర్డీఓ ఏఓగా, జంగారెడ్డిగూడెం, పోలవరం తహసీల్దార్లుగా పనిచేశారు. ఎన్నికల విధుల నిర్వహణ నిమిత్తం కృష్ణా జిల్లా చల్లపల్లికి బదిలీపై వెళ్లి ప్రస్తుతం చేపట్టిన బదిలీల్లో చల్లపల్లి నుంచి దెందులూరు తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు.

కౌలు రైతులపై దృష్టి సారించాలి



వ్యవసాయ సిబ్బందికి సూచనలిస్తున్న ఏడీఏ మురళీకృష్ణ

గణపవరం: ఖరీఫ్ సీజన్‌లో ఈ పంట నమోదులో కౌలు రైతులపై దృష్టి సారించాలని తాడేపల్లిగూడెం ఏడీఏ పి.మురళీకృష్ణ అన్నారు. మంగళవారం సాయంత్రం గణపవరం రైతు భరోసా కేంద్రంలో వీఏఏలకు ఈపంట నమోదుపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతులను గుర్తించి, వారందరికీ సీసీఆర్‌సీ కార్డులు ఇప్పించే బాధ్యత వ్యవసాయ సిబ్బంది తీసుకోవాలని సూచించారు. బ్యాంకు రుణాలు ఇచ్చేలా ఆయా బ్యాంకు అధికారులతో వారిని సమన్వయం చేయాలని అన్నారు. ప్రస్తుతం ఉన్న వరిపంటపై పలు సూచనలు ఇచ్చారు. నాట్లు వేసిన తొలిదశలో 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్, చిరుపొట్ట దశలో ఎకరాకు 20 కిలోల పొటాష్ వేయాలని సూచించారు. తొలిదశలో పొటాష్ వినియోగం వల్ల పైరుకు వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఏవో యర్రంశెటి ప్రసాద్ పాల్గొన్నారు.

పంచాయతీ నిధుల గోల్‌మాల్‌పై విచారణకు ఆదేశం

ఉంగుటూరు: వెల్లమిల్లి గ్రామ పంచాయతీలో సుమారు రూ.20 లక్షల పైగా నిధులు గోల్‌మాల్ అయ్యాయని ఆరోపిస్తూ ఆ గ్రామానికి చెందిన వీరాంజనేయ చౌదరి పంచాయతీరాజ్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేయాలని డీపీవో తూతిక విశ్వనాథంకు మంగళవారం రాష్ట్రస్థాయి అధికారుల నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. డీపీవో విశ్వనాథం, డీఎల్ పీవోను విచారణ అధికారిగా నియమించారు. ఆయన త్వరలో పంచాయతీకి వచ్చి విచారించనున్నారు. ఈ నిధులు దుర్వినియోగం విషయంపై జిల్లా పంచాయితీ అధికారి తూతిక విశ్వనాథంను ప్రశ్నించగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేపట్టి ఫిర్యాదులో పేర్కొన్న ఆరోపణలు రుజువు అయితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి బాలాజీని ప్రశ్నించగా ఆరోపణలు వాస్తవం కాదని, విచారణలో వాస్తవాలు తెలుస్తాయని అన్నారు.

సాల్వేషన్ ఆర్మీ అంతర్జాతీయ కార్యదర్శులుగా పశ్చిమవాసులు

తొలి తెలుగు అధికారులుగా అరుదైన ఘనత



సాల్వేషన్ ఆర్మీ అంతర్జాతీయ కార్యదర్శులుగా నియమితులైన దాసరి జాన్‌కుమార్, దాసరి మణికుమార్ (ఫైల్)

దెందులూరు: సాల్వేషన్ ఆర్మీ అంతర్జాతీయ కార్యదర్శులుగా పశ్చిమ వాసులు నియమితులయ్యారు. తొలిసారిగా తెలుగు అధికారులుగా జిల్లావాసులకు ఈ అరుదైన ఖ్యాతి దక్కింది. ఏలూరు జిల్లా పెదపాడు మండలం పాతముప్పర్రు గ్రామానికి చెందిన దాసరి జాన్‌కుమార్, మణికుమార్ తమిళనాడులో సాల్వేషన్ ఆర్మీ టెరిటోరియల్ కమాండర్లుగా పనిచేస్తున్నారు. వీరిద్దరికీ ప్రస్తుతం అంతర్జాతీయ కార్యదర్శులు (లండన్)గా పదోన్నతి లభించింది.

జిల్లా అధికారుల హర్షం : జిల్లా వాసులకు అంతర్జాతీయ కార్యదర్శులుగా పదోన్నతి లభించడంపై సాల్వేషన్ ఆర్మీ ఏలూరు జిల్లా డివిజనల్ కమాండర్ జల్లి మోషే, మేరీ కుమారి, దెందులూరు కోర్ ఆఫీసర్ కె.రమణయ్య, కొవ్వలి కోర్ ఆఫీసర్ సుబ్బారావు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

దెందులూరు: శ్రీరామవరం గ్రామానికి చెందిన దాత కామిరెడ్డి బాలు మరోసారి మానవత్వం చాటుకున్నారు. శ్రీరామవరంలో ఇటీవల పేద కుటుంబానికి చెందిన ఎర్రా అంజియ్య, సత్తెమ్మ దంపతులు ఏలూరు వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో సత్తెమ్మ మృతి చెందడంతో వారి కుటుంబాన్ని కామిరెడ్డి బాలు పరామర్శించి అంజియ్య చికిత్స నిమిత్తం రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. గాయాలపాలై ఆరోగ్యం క్షీణించడంతో భర్త అంజియ్య సైతం ఇటీవల మృతి చెందాడు. ఆ దంపతులకు జన్మించిన ముగ్గురు పిల్లల భవిష్యత్తు కోసం కామిరెడ్డి బాలు రూ. 50 వేలు ఆర్థిక సాయం అందించారు. మృతుని కుటుంబ సభ్యులు శ్రీరామవరం దళితులు, నాయకులు దాత బాలుకు కృతజ్ఞతలు తెలిపారు.

పోతునూరు సర్పంచ్‌కు సత్కారం

దెందులూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మూడేళ్లకలగా అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతుల కల్పనకు అన్నింటిలోనూ విశిష్ట సేవలందించినందుకు పోతునూరు సర్పంచ్ బోదుల స్వరూపను ఉంద్రాజవరం చర్చి ఫాస్టర్ ఇసాక్ మంగళవారం సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సంఘస్తులు పాల్గొన్నారు.

తల్లిపాలు పిల్లలకు అమృతంతో సమానం



విజయరాయిలో గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న సీడీపీఓ, సూపర్‌వైజర్, కార్యకర్తలు

పెదవేగి : ప్రతి బాలింత తప్పనిసరిగా బిడ్డ పుట్టిన గంటలోపు అమృతంతో సమానమైన ముర్రుపాలను తప్పనిసరిగా ఇవ్వడంతో పాటు తల్లిపాలను ఆరునెలల వరకూ ఇస్తూనే ఉండాలని పెదపాడు ప్రాజెక్టు సీడీపీఓ కె.విజయలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని విజయరాయిలో ప్రభుత్వ పాఠశాలలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తల్లి పాల వారోత్సవాల కార్యక్రమాన్ని పెదపాడు ప్రాజెక్టు సీడీపీఓ విజయలక్ష్మి, విజయరాయి సెక్టార్ సూపర్‌వైజర్ కె మేరీబాయమ్మ ఆధ్వర్యంలో సర్పంచ్ గొట్టాపు కృష్ణవేణి రాంబాబు అధ్యక్షతన తల్లి పాల వారోత్సవాలను కోలాహలంగా నిర్వహించారు. గ్రామంలోని ఆరు అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణీలకు సీమంతాలు, చిన్నారులకు అన్న ప్రాసనలు నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు అనంతలక్ష్మి, పద్మ, బేబిరాణి, ఆలీసమ్మ, సూర్యకుమారి, రంగమ్మ, గర్భిణులు పాల్గొన్నారు.

బిడ్డ ఆరోగ్యంగా ఎదిగేందుకు తల్లిపాలు దోహదం

భీమడోలు: తల్లి పాలు బిడ్డకు అమృతంతో సమానమని, చిన్నారులు ఆరోగ్యంగా ఎదిగేందుకు తల్లి పాలు దోహదం చేస్తాయని భీమడోలు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి కేవీ విజయలక్ష్మి అన్నారు. గుండుగొలను సెక్టార్ పరిధిలోని గుండుగొలను-23 అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లి పాల వారోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి గుండుగొలను వైద్యాధికారిణి కె.శ్రీలక్ష్మి అధ్యక్షత వహించారు. డాక్టర్ కె.శ్రీలక్ష్మి, పీవో కేవీ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి తల్లి తన బిడ్డకు రెండేళ్ల పాటు పాలు పట్టించాలని, తొలి ఆరు నెలల పాటు తల్లిపాలు ఇవ్వడంతో పాటు అనుబంధ ఆహారాన్ని అందించాలన్నారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎం.కవిత, హెచ్ఈ కె.మల్లేశ్వరి, ఎఎన్ఎం ఎస్.రత్న, అంగన్‌వాడీ టీచర్లు బోడ రాజమణి, విజయ, పద్మ, సుందరి, సత్యవేణి, అన్నమ్మ, ఈశ్వరి, రమ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



గుండుగొలనులో మాట్లాడుతున్న వైద్యాధికారిణి కె.శ్రీలక్ష్మి, పీవో కేవీ విజయలక్ష్మి

గర్భిణులకు సామూహిక సీమంతాలు

భీమడోలు: బిడ్డకు తల్లి పాలు ఇవ్వడంపై అపోహలు వీడనాడాలని భీమడోలు ఐసీడీఎస్ పీవో కేవీ విజయలక్ష్మి అన్నారు. భీమడోలులో ఈతకోటవారి వీధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో భీమడోలు పంచాయతీ పరిధిలో సోమవారం ప్రపంచ తల్లి పాల వారోత్సవాలపై గర్భిణులు, బాలింతలు, మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ షహనాజ్ బేగం, అంగన్‌వాడీ సిబ్బంది గంధం మహాలక్ష్మి, తల్లులు, మహిళలు పాల్గొన్నారు.

దెందులూరు మండలంలో ..

దెందులూరు: గర్భిణులు, బాలింతలు, స్త్రీ,శిశు, సంక్షేమశాఖ సలహాలు, సూచనలు పాటించాలని ఐసీడీఎస్ దెందులూరు సెక్టార్ సూపర్‌వైజర్ చిట్టెమ్మ కోరారు. మంగళవారం కొమిరేపల్లి, శ్రీరామవరం, సత్యనారాయణపురంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు.అంగన్‌వాడీ సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

చేనేత ప్రాచీన వారసత్వ సంపద

గణపవరం: మన ప్రాచీన వారసత్వ సంపద చేనేతను ప్రతి ఒక్కరూ ఆదరించాలని, చేనేతకు పూర్వవైభవం తీసుకురావల్సిన బాధ్యత అందరిపై ఉందని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజి ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అన్నారు. మంగళవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా డిగ్రీ కాలేజిలో మహిళా సాధికార విభాగం, ఎకో క్లబ్‌ల ఆధ్వర్యంలో చేనేత ప్రాముఖ్యత, ప్రాధాన్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించడానికి ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రత్యేక రోజులలోనైనా చేనేత వస్త్రాలను ధరించాలని సూచించారు. ఈసందర్భంగా చేనేత కళాకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మల్లేశం డాక్యుమెంటరీను విద్యార్థులకు ప్రదర్శించి చూపారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ సమన్వయకర్త చైతన్య, మహిళా సాధికార విభాగం కన్వీనర్ స్వరూపరాణి, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త జి వెంకటరమణ, ఎకో క్లబ్ కోఆర్డినేటర్ పర్వీన్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరం



ర్యాలీ నిర్వహిస్తున్న సూపర్‌వైజర్ నూర్జహాన్, ఉపాధ్యాయులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది

భీమడోలు: పూళ్ల సెక్టార్ పరిధిలోని అంబర్‌పేట, వడ్లపట్లలో మంగళవారం బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని కోరుతూ అవగాహన ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహించారు. సూపర్‌వైజర్ నూర్జహాన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య ఆరోగ్య సిబ్బంది పురవీధుల్లో చట్టరీత్యా బాల్య వివాహాలు నేరమని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

స్వాతంత్ర్య స్ఫూర్తిని చాటుదాం

భీమడోలు: స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని ప్రతి ఒక్కరికి చాటి చెప్పాల్సిన బాధ్యత మనందరిపై ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ విక్రమ్ కిషోర్ అన్నారు. భీమడోలు బీజేపీ కార్యాలయంలో మంగళవారం మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ పటేల్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షుడు సీహెచ్ విక్రమ్ కిషోర్, నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణి పాల్గొని పలు అంశాలపై చర్చించారు. ఈ నెల 15న నిర్వహించనున్న భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు, పార్టీ సంస్థాగతంగా బలోపేతం తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్ మాట్లాడుతూ ప్రతి ఇంటిపై భారతీయ జెండాను ఎగురవేయాలని ప్రజలందరినీ చైతన్యవంతులు చేయాలన్నారు. గ్రామాల్లోని స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. నాయకులు నగరపాటి సత్యనారాయణ, మత్తి శ్రీనివాస్ శాస్త్రి, వెజ్జు ధర్మారావు పాల్గొన్నారు.

గ్రామ సభలో సమస్యల ఏకరువు



కన్నాపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతమనేని

దెందులూరు: గ్రామ సభలో అనేక సమస్యలను ప్రజలు చింతమనేని ప్రభాకర్ దృష్టికి తీసుకువచ్చారు. మంగళవారం పెదవేగి మండలం కన్నాపురం, తాళ్లగోకవరం, కొప్పులవారిగూడెం గ్రామాల్లో సచివాలయ ఉద్యోగులు, అధికారులు, నాయకులతో కలిసి గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే చింతమనేని అన్నారు. సమావేశంలో పెదవేగి మండల టీడీపీ అధ్యక్షుడు బొప్పన సుధాకర్, పార్టీ నాయకులు తాతా సత్యనారాయణ పాల్గొన్నారు.

వ్యక్తిగత నైపుణ్యాలు పెంచుకోవాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థులు చదువుకునే సమయంలోనే తమలోని వ్యక్తిగత నైపుణ్యాలు పెంపొందించుకోవాలని కెరీర్ కౌన్సిలర్ జి.ప్రవీణ్ కృష్ణ సూచించారు. జిల్లా యువజన సర్వీసుల శాఖ, జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో స్థానిక బాలగంగాధర్ తిలక్ నగరపాలక ఉన్నత పాఠశాలలో వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు చదవడం ద్వారా విజ్ఞానం సంపాదించాలన్నారు. కార్యక్రమంలో వొకేషనల్ గైడెన్స్ కోర్స్ ఈఓలు వి.వరలక్ష్మి, రామబ్రహ్మం, ప్రధానోపాధ్యాయుడు షరీఫ్, సెట్‌వెల్ మేనేజర్ పీవీఎస్ సత్యనారాయణ, పర్యవేక్షకుడు కేజే కెనడీ పాల్గొన్నారు.